సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 8 । ఆగస్టు । 2024



భర్తే కాలయముడై

భర్తే కాలయముడై భార్యను కడతేర్చాడు. రామానుజపురంలో జరిగిన ఘటనలో కత్తితో విచక్షణారహితంగా నరకడంతో భార్య ప్రాణాలు కోల్పోయింది. 8లో ▸



చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ హైవే

భారీ వర్షాలకు మందగించిన ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. 8లో ▸



నిందితుడి అరెస్టు

నూజివీడు ప్రాంతంలో చిన్నారిపై అఘాయిత్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేశారు. హనుమాన్ జంక్షన్‌లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు బుధవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు న్యాయమూర్తికి శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనం పలికారు.

ఎర్రకాలువకు పోటెత్తుతున్న వరద



పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు డైవర్షన్ రహదారి మీదుగా ప్రవహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు మండలంలోని కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయంలోకి గంటకు 6,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా డ్యాం గేట్ల ద్వారా గంటకు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.88 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. పట్టెన్నపాలెంలో జల్లేరు వాగు డైవర్షన్ రహదారి మీదుగా ప్రవహిస్తోంది. దీంతో మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. దేవులపల్లి నుంచి లక్కవరం వెళ్లే రహదారిలో కల్వర్టు ప్రాంతం కుంగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తింది. విషయం తెలుసుకున్న లక్కవరం ఎస్సై సుధీర్ సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో గ్రావెల్ వేసి సరిచేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

భీమవరం: ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) కోసం రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో 8 వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులు. డిసెంబర్ 8న నిర్వహించే పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 రుసుం చెల్లించాలన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రం స్థాయిలోను, సెక్టార్, మండల స్థాయిలో, ప్రాజెక్టు స్థాయిలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తున్నారు. భీమవరం ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారిణి బి.సుజాత రాణి మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

బేరం కుదిరితేనే బదిలీ

మన సామాజిక వర్గం అవ్వాలి... స్టేషన్లకు ఆదాయం బాగుంటుంది కాబట్టి పోస్టుకు రూ.15 లక్షలు ఇవ్వాలి... ఈ రెండు ఓకే అయితేనే సిఫార్సు చేద్దాం.. ఇది ఏలూరు నగరంలో ఓ స్టేషన్‌కు ప్రజాప్రతినిధి ఫిక్స్ చేసిన రేటు..

మా సెంటర్ పేకాటకు హబ్ లాంటిది. పేకాట, కోడిపందాలు, ఇతర వ్యవహారాలన్నీ మా కనుసన్నల్లో చేయాలి. అది కూడా మా సామాజికవర్గం సీఐ అయితే మాకు ఓకే.. వీటితోపాటు రూ. 15 లక్షల నుంచి 20 లక్షల వరకు చెల్లించాలి.. ఇది పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో వినిపిస్తున్న మాట..

- ప్రజాప్రతినిధుల వద్ద తేలని పంచాయితీ
- ఏలూరు, పశ్చిమలో కీలక సీఐ పోస్టులు పెండింగ్‌లోనే
- ఏలూరు, ఆకివీడు, భీమవరం రూరల్‌కు భారీ గిరాకీ
- బేరంతో పాటు సామాజికవర్గ అనుకూలత తప్పనిసరి

రెండు జిల్లాల్లో అత్యధిక సర్కిళ్లకు రేటు కట్టి మరీ వసూళ్లు చేసి సిఫార్సు చేసే సరికొత్త సంస్కృతి మొదలైంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలవుతున్నా.. రేట్లు అనుకూలంగా లేకపోవడం, సామాజిక అనుకూలతలు కుదరక.. ఇంటెలిజెన్స్ విచారణ పేరుతో హడావుడి చేయడం వెరసి 60 రోజులు గడిచినా పోస్టులు భర్తీ చేయలేని పరిస్థితి.





సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరు రేంజ్ పరిధిలో ఆరు పోలీస్ జిల్లాల్లో బదిలీల ప్రక్రియ ఇటీవల ప్రారంభమైంది. ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కీలక స్థానాలకు డిమాండ్ ఉండటంతో ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో కొన్ని కీలక స్థానాలకు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియలో గందరగోళం రేగడంతో పోస్టింగుల వ్యవహారం ముందుకు సాగని పరిస్థితి.

ఒకే పోస్టింగ్‌కు ఎమ్మెల్యే, ఎంపీ వేర్వేరుగా పట్టుపడుతుండటంతో పోలీసు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ప్రధానంగా ఏలూరు జిల్లాలో కీలక స్థానాలుగా ఉండే ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, కైకలూరు రూరల్, నూజివీడు, చింతలపూడి, భీమడోలు, జీలుగుమిల్లి, కుక్కునూరు సర్కిళ్లు అలాగే పశ్చిమగోదావరిలో భీమవరం రూరల్, తణుకు టౌన్, రూరల్, ఆకివీడు, పెనుగొండ ఇలా కీలక సర్కిళ్లు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. ఇప్పటికే ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల పరిధిలో 44 మంది సీఐల బదిలీలు జరిగాయి. అవన్నీ కూడా రాజకీయ సిఫార్సులకు అనుగుణంగానే జరిగాయి. రేట్లల్లో తేడాలుగాని, ఇతర కారణాలతో 44 పోస్టింగుల్లో మూడు పోస్టింగులు మరునటి రోజే నిలిపేశారు.

తేలని బేరాలు

అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా చెప్పుకోదగ్గ స్థాయిలో ఆదాయం లేకపోవడంతో సీఐ పోస్టుల విక్రయాలకు తెరతీశారు. కొన్నిచోట్ల రేట్లు పెట్టి అన్వేషిస్తే ఆశావహులు దొరుకుతున్నారు గాని ప్రజాప్రతినిధుల షరతులకు హడలిపోతున్నారు. మెట్ట ప్రాంతంలోని ఒక సబ్‌డివిజన్ పరిధిలో సీఐ పోస్టుకు నగటున రూ.10 లక్షలు తప్పనిసరి. దీంతో పాటు తెలంగాణ మద్యం, గ్రావెల్, ఇసుక, అటవీ సంపద, అక్రమ రవాణ, రేషన్ బియ్యం ఇలా అన్నింటిలోనూ బాగా చూసుకోవాలి. పామాయిల్ తోటల్లో వారానికి రెండు రోజులు పేకాట శిబిరాలు పెట్టుకున్నా అటువైపు కన్నెత్తి చూడటానికి వీల్లేదు. జిల్లా ప్రధాన కేంద్రమైన మూడు స్టేషన్లల్లో ఒక స్టేషన్‌కు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడే తలనొప్పి కూడా మొదలైంది. స్థానిక ప్రజాప్రతినిధి అన్ని సెట్ చేసుకుని ఒకరిని సూచిస్తే.. ఎంపీ అదే పోస్టుకు తన సామాజికవర్గానికి చెందిన మరొకరిని సూచించారు. దీంతో ప్రస్తుతానికి పోస్టింగ్ పెండింగ్‌లో పెట్టారు.

పేకాట, కోడి పందేల కేసులు ఉండకూడదు

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రంలో భీమవరం రూరల్ స్టేషన్‌కు భారీ డిమాండ్ ఉంది. రూ.15 లక్షల నుంచి 20 లక్షల వరకు చెల్లించడంతో పాటు పేకాట, కోడి పందేల కేసులే ఉండకూడదని ప్రజాప్రతినిధి ముఖ్యగణం ప్రత్యేక షరతులు విధించారు. వీటన్నింటితో పాటు ఇంటిలిజెన్స్ వడపోత పేరుతో రేట్లు పెరిగినట్లు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతుంది. గతంలో అధికారి పనితీరు, ప్రజాప్రతినిధి సిఫార్సుతో వెంటనే పోస్టింగులు వేసేవారు. ఇప్పుడు మాత్రం ప్రజాప్రతినిధి ప్యాకేజీ, సిఫార్సుతో పాటు ఎంపిక చేసుకున్న సీఐ గురించి ఇంటిలిజెన్స్ విచారణ సీఎంఓ నుంచి నిర్వహించి ఓకే అని చెబితేనే పోస్టింగులు దక్కుతున్న పరిస్థితి. దీంతో అందర్నీ ఒప్పించాలి కాబట్టి కొద్దిగా ఎక్కువ ఖర్చు అవుతుందని తెలుగు తమ్ముళ్లు బహిరంగంగానే చెబుతున్న మాట. మొత్తం మీద రెండు జిల్లాల్లో 25 పోస్టులకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి.

చేనేత అభివృద్ధికి సహకరించాలి

కలెక్టర్ నాగరాణి



చేనేత కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: చేనేత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, చేనేత వస్త్రాల కొనుగోలు ద్వారా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో జిల్లా చేనేతశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 10వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చేనేత వస్త్రాలు ధరించడంలో సౌలభ్యంతో పాటు, ఆరోగ్యపరంగా మంచిదన్నారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు చేనేతకు మంచి ఆదరణ తీసుకొచ్చారని కాలం గడిచిన కొద్దీ యంత్రాల మీద తయారయ్యే వస్త్రాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. చేనేత వస్త్రం తయారీలో కార్మికుల కష్టం చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు సమతం చిన్న సముద్రం లింగం, సిద్ధాని విఘ్నేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.రామయ్య, ఏడీఓ జి.గుర్రాజు, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.



11 మంది ఎస్సైల బదిలీ

భీమవరం: జిల్లాలో 11 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీలు ఇలా ఉన్నాయి..

ఫాజిల్ రహమాన్ (డీటీసీ)ను భీమవరం టూటౌన్, జేవీఎస్ ప్రసాద్ (తాడేపల్లిగూడెం టౌన్)ను తాడేపల్లిగూడెం రూరల్, పెద్దిరెడ్డి సురేష్ (తాడేపల్లిగూడెం రూరల్)ను వీఆర్, భీమవరం, సీహెచ్ జయలక్ష్మి (దిశ, భీమవరం)ను నరసాపురం టౌన్, కె.చంద్రశేఖర్ (తణుకు రూరల్)ను తణుకు టౌన్, ఎన్.శ్రీనివాసరావు (పాలకోడేరు)ను కాళ్ల, పీఎస్‌వీ భద్రరావు (కాళ్ల)ను వీఆర్, భీమవరం, జానా సతీష్ (దిశ, భీమవరం)ను ఇరగవరం, డి.ఆదినారాయణ (ఇరగవరం)ను తణుకు ట్రాఫిక్, కె.గురయ్య (నరసాపురం రూరల్)ను యలమంచిలి, కె.శివన్నారాయణ (యలమంచిలి) వీఆర్, భీమవరానికి బదిలీ చేశారు.

పొంగిపొర్లిన కొండ వాగులు

బుట్టాయగూడెం: భారీ వర్షాలతో ఏజెన్సీ ప్రాంతంలో బుధవారం కొండవాగులు పొంగిపొర్లాయి. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరువాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుబ్బల మంగమ్మ గుడి పై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. కేఆర్‌పురం సమీపంలోని తూర్పు కాల్వ, చింతకొండ కాల్వ, పీఆర్‌గూడెం వెళ్ళే దారిలోని జారుడు కాల్వతో పాటు పలు కొండ కాల్వలు పొంగి పొర్లాయి. జీలుగుమిల్లి మండలంలోని వంకవారిగూడెం రోడ్డుపై నుంచి జీలుగుమిల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. ఎగువ ప్రాంతంలోని కొండలపై కురిసిన భారీ వర్షాలకు గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా వర్షాలకు 215.85 మీటర్లకు చేరుకుంది. మంగళవారం రెండు గేట్లు ఎత్తి 400 క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు. మండలంలోని పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యానికి మించి వరదనీరు ప్రవహిస్తుంది.

కుక్కునూరు మండలంలో..



రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగు పొంగుతున్న దృశ్యం



వెంకటాపురం గ్రామం వద్ద పొంగిపొర్లుతున్న రాళ్ల వాగు

కుక్కునూరు: మండలంలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గుండేటి వాగు, పాల వాగు, రాళ్ల వాగు, రెడ్డిగూడెం వాగు, పాములేరు వాగు, కిన్నెరసాని వాగులు ఉధృతంగా ప్రవహించాయి. వెంకటాపురం నుండి తిమ్మంపేట రహదారి మధ్య రాళ్లవాగు పొంగడంతో విద్యుత్ స్తంభాలు నెలకొరిగి రోడ్డు అడ్డంగా పడిపోయాయి. కివ్వాక, రాయిగొమ్ము గ్రామాల మధ్య వరద నీరు రోడ్డుపైకి చేరింది. సీతారామనగరం, శ్రీధర గ్రామాల మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి వరద క్రమంగా పెరుగుతుంది. బుధవారం ఉదయం 32 అడుగులుగా ఉన్న గోదావరి వరద సాయంత్రానికి 35 అడుగులకు చేరుకుంది.

మెట్టను ముంచెత్తిన వర్షం

చింతలపూడి: అల్ప పీడన ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మెట్టలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు, చెరువులు వరద నీటితో కళకళలాడుతున్నాయి. చెరువులు అలుగులు పడి వరద నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. తమ్మిలేరు ప్రాజెక్టు నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలకు తమ్మిలేరు పూర్తి స్థాయి. నీటి మట్టానికి చేరుకుంది.

నాట్లు నీటుగా

- బెంగాలీ నాట్లకు రైతుల్లో క్రేజ్
- 12-15 కేజీల విత్తనంతో ఎకరాలో నాట్లు

ఆకివీడు: వరిలో నాట్లు బాగా పడితే దిగుబడి బాగా వస్తుందని రైతులు ఆశిస్తారు. కొన్నాళ్ల క్రితం వరకూ మన రైతులు నాట్ల కోసం స్థానిక కూలీలపైనే ఆధారపడేవారు. అయితే ఇప్పుడు బెంగాలీ కూలీలకు క్రేజ్ పెరిగింది. కూలీల కొరత, ఖర్చులు తగ్గడం, చీడపీడలు తక్కువగా ఆశించడం, దిగుబడులు పెరుగుతుండటంతో రైతులు బెంగాలీ కూలీల వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ కూలీలు ఎకరం పొలంలో నాటు వేయాలంటే 20 నుంచి 30 కిలోల విత్తనాలతో నారుమడి పోయాలి. బెంగాలీ కూలీలతో నాటు వేయిస్తే అదే నారుమడి నాలుగు ఎకరాలకు సరిపోతుంది. ప్రస్తుతం వరదలు, భారీ వర్షాలతో వేల ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. తిరిగి నాట్లు వేయాలంటే బెంగాలీ కూలీలైతే పాదుపుగా వేస్తారని రైతులు చెబుతున్నారు.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

బెంగాలీ కూలీలు లైన్ వరుసలతో నాటు వేయడం, రెండు మూడు పిలకలు నాటడం, భూమిలోపల రెండు అంగుళాల లోతులో నాట్లు వేయడంతో పిలకలు బాగా పెరిగి దుబ్బు బాగా చేస్తుంది. వరుస నాటు వల్ల మొక్కల మధ్య ఖాళీగా ఉండి గాలి బాగా



ఖరీఫ్‌లో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఆడి చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి. దీంతో సాధారణ నాటు కంటే 3 నుంచి 5 బస్తాల దిగుబడి పెరుగుతుంది. స్థానిక కూలీలతో నాటు వేయాలంటే నారు లాగడానికి వేరే మగ కూలీలు, నాటు వేయడానికి ఆడ కూలీలను వేరుగా పిలవాలి. స్థానికులతో నాటు వేయించాలంటే ఎకరం నారు లాగడానికి రూ.2 వేలు. నాటు వేయడానికి రూ.3 నుంచి రూ. 4 వేలు తీసుకుంటున్నారు. బెంగాలీ కూలీలైతే నారులాగి నాటు వేయడానికి రూ.4,200 తీసుకుంటున్నారు.

మళ్లీ నారుమడులు వేసేందుకు సిద్ధం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరదలు, భారీ వర్షం వల్ల ఖరీఫ్ సాగుకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో రైతులు మళ్లీ నారుమడులు వేసేందుకు సిద్ధపడుతుంటే, మరి కొంత మంది అందుబాటులోఉన్న నారును వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,750 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేసేందుకు సిద్ధం చేశారు.

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం

పశ్చిమలో భారీ వర్షాలు, వరదలకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. మళ్లీ నారుమడులు వేసుకునేందుకు రైతులకు అవసరమయ్యే 4,250 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేశాం. ఇప్పటికే 500 క్వింటాళ్ల విత్తనాల్ని నారుమడులుగా వేశారు. బెంగాలీ కూలీలతో నాట్లు వేయడం వల్ల లాభదాయకంగా ఉందని రైతులు చెబుతున్నారు.

– జెడ్.వెంకటేశ్వర్లు, జేడీ, వ్యవసాయ శాఖ, పశ్చిమగోదావరి జిల్లా

56,380 ఎకరాల్లో నాట్లు పూర్తి

ఏలూరు జిల్లాలో ఖరీఫ్ సాగు 1,26,630 ఎకరాల్లో చేపట్టాల్సి ఉంది. నారుమడులు ధ్వంసం కావడంతో సబ్సిడీపై 242 క్వింటాళ్ల విత్తనాల్ని రైతులకు అందజేశాం. మళ్లీ నారుమడులు వేసుకుంటున్నారు. నారు సర్దుబాటు చేసుకుని రైతులు కొన్ని చోట్ల నాట్లు వేస్తున్నారు. నారు తక్కువగా ఉన్న చోట్ల బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు.

–ఎస్కే.హబీబ్ బాషా, జేడీ, వ్యవసాయ శాఖ, ఏలూరు జిల్లా

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సాగు

పశ్చిమగోదావరి జిల్లా
మొత్తం సాగు : 2,11,000 ఎకరాలు
నాట్లు పూర్తి: 1,30,300 ఎకరాలు
ఇంకా వేయాల్సింది: 80,700 ఎకరాలు

ఏలూరు జిల్లాలో ఖరీఫ్ సాగు
మొత్తం సాగు : 1,26,630 ఎకరాలు
ఇప్పటికి పూర్తయినది : 56,380 ఎకరాలు
ఇంకా వేయాల్సింది: 70,250 ఎకరాలు

బెంగాలీ కూలీల సాగుతో లాభాలివే

- ఎకరాకూ 12 నుంచి 15 కేజీల విత్తనాలు సరిపోతాయి.
- 15–18 రోజుల వయసున్న నారుతో నాట్లు
- భూమిలోపలికి కాకుండా, పైపైన మాత్రమే మొక్కను నాటుతారు.
- క్రమపద్ధతిలో నాటుతారు. మొక్కకూ మొక్కకూ 8–10 అంగుళాల ఖాళీ వస్తుంది. దీనివల్ల మొక్కకు గాలి, వెలుతురు అధికంగా అందుతుంది.
- చీడ పీడలు ఆశించడానికి అంతగా అవకాశం ఉండదు.
- తాడు, గీతలు, కర్రలు ఉపయోగించకుండా లైన్‌గా నాటడం సులువుగా చేస్తారు.

పాలిటెక్నిక్‌లో చేరికపై అవగాహన కల్పించాలి

భీమవరం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరికకు విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యాభ్యాసంతో అవకాశాలు, ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ తక్కువ ఫీజుతో అందుబాటులో ఉందన్నారు.

చురుగ్గా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

- వర్షాల జోరుతో నెలరోజులుగా మందగించిన పనులు
- ప్రస్తుతం మళ్లీ ఊపందుకున్న పనులు
- 2025లో హైవే అందుబాటులోకి వచ్చే అవకాశం


చింతలపూడి ప్రాంతంలో నిర్మాణం జరుపుకుంటున్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి


మెట్ట ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి

చింతలపూడి : గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొంత మందగించిన ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. ఇటీవల అల్ప పీడన ప్రభావంతో పాటు రుతుపవనాల ప్రభావం కూడా తోడవ్వడంతో రెండు రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా అటు ఖమ్మం, ఇటు ఏలూరు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడడంతో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేక హైవే పనులు నిలిచిపోయాయి. గత రెండు రోజులుగా వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో హైవే నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం చేపట్టడంతో రవాణా సదుపాయాలు మెరుగుపడబోతున్నాయి. ప్రస్తుతం ఖమ్మం–రాజమండ్రి పట్టణాల మధ్య 220 కిలోమీటర్ల దూరం ఉంది. దీన్ని 162.126 కిలోమీటర్లకు తగ్గించడానికి భారతీమాల ప్రాజెక్టులో భాగంగా కేంద్రప్రభుత్వం ఈ రహదారిని నిర్మిస్తోంది. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,609 కోట్లకు అంచనాలను తయారు చేసింది. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈరహదారిని వర్గీకరించారు. కేంద్ర ఉపరితల, రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో జిల్లాలోని రెండు ఫేజ్‌లలో చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రహదారి కోసం మొత్తం 1,411 ఎకరాల భూమి అవసరమవుతుంది. అందులో 114 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 1,297 ఎకరాలు రైతుల నుంచి సేకరించారు. ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కృష్ణాపురం, తుంబూరు గ్రామాల వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఈ జాతీయ రహదారి ప్రవేశిస్తుంది. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ రహదారిని వర్గీకరించారు.

ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో మొత్తం 5 ప్యాకేజీలుగా విభజించి పనులను చేపట్టారు. మొదటి ప్యాకేజీ 33.06 ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు ఉంటుంది. రెండో ప్యాకేజీ 33.65 కిలోమీటర్ల మేర సోమవరం నుంచి పెనుబల్లి మండలం చింతగూడెం వరకు ఉంటుంది. మూడో ప్యాకేజి 42.119 కిలోమీటర్లు చింతగూడెం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్టం ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం రేచర్ల గ్రామం వద్ద నిర్మించనున్నారు. నాలుగో ప్యాకేజీ 27.428 కిలో మీటర్లు రేచర్ల నుంచి గురవాయిగూడెం వరకు, ఐదో ప్యాకేజీ 29.46 కిలో మీటర్లు గురవాయిగూడెం నుంచి దేవరపల్లి లింక్‌వరకు నిర్మాణం చేపడతారు. ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు.

5 ఎగ్జిట్లు

ఖమ్మం–దేవరపల్లి ఎక్స్‌ప్రెస్ రహదారిలో రాకపోకలకు అనువుగా 5 ఎగ్జిట్లు (ఇంటర్ ఛేంజ్ బ్రిడ్జిలు) నిర్ణయించారు. భారీ వాహనాలు వెళ్లేందుకు 5, చిన్న వాహనాలు రాకపోకలు సాగించేందుకు మరో 11 చోట్ల అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. రహదారి పొడవునా ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు ఎత్తు పెంచుతూ అండర్ పాస్‌లు, ఇంటర్ ఛేంజ్ బ్రిడ్జిలు నిర్మాణం చేపడుతున్నారు. జిల్లాలో రెండు దశల్లో నిర్మాణం చేపట్టనున్న ఈ ప్రాజెక్టును పూణేకు చెందిన బెకం ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. ప్రస్తుతం రహదారి పనులు శరవేగంగా చేపడుతున్నారు. 2025లో ఈ రహదారి అందుబాటులోకి రానుంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే హైదరాబాద్, విశాఖపట్టణానికి కూడా రవాణా మరింత అభివృద్ధి చెందుతుంది.

రూపురేఖలు మారతాయి



ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పూర్తయితే మెట్ట ప్రాంతం, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులో ఉన్న చింతలపూడి నియోకవర్గ రూపురేఖలు మారతాయి. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ రహదారి ఒక వరం లాంటిది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కేంద్ర ప్రభుత్వం ఈ రహదారిని మంజూరు చేయడం అదృష్టం .

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం


సీహెచ్‌సీలోవైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా సర్వేలెన్స్ వైద్యాధికారిణి ధనలక్ష్మి

ఆకివీడు: మండలంలోని పలు ప్రాంతాల్లో ఇన్‌ఫ్లుయెంజా వ్యాధిలక్షణాలు ఉన్న వ్యక్తుల నుంచి స్వాబ్ సేకరించి, విజయవాడలోని ఎస్ఎంసీకి పంపిస్తున్నట్టు జిల్లా ప్రోగ్రాం అండ్ మానటరింగ్ అధికారి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ ధనలక్ష్మి చెప్పారు. స్థానిక పీహెచ్‌సీ, సీహెచ్‌సీని, ఫీవర్ ఉన్న వ్యక్తుల ఇళ్లకు వెళ్లి ఆమె బుధవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీవర్ ఉన్న కేసులన్నీ సాధారణంగానే రికవరీ అవుతున్నట్లు తెలిపారు. జ్వరం, దగ్గు, వైరల్ ఫీవర్, డెంగీ, మలేరియా జ్వరాలు, నీటి కాలుష్యం వల్ల వాంతులు, విరోచనాలతో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటివాటి బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. నిల్వ ఉన్న పదార్థాలను తినరాదని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలు ఉన్నా దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించాలని ఆమె సూచించారు. తొలుత సీహెచ్‌సీలో వైద్యులతో వైరల్ ఫీవర్‌పై ఆమె సమీక్షించారు. జ్వరాలు అధికంగా రావడం, వాటి పట్ల తీసుకున్న చర్యలపై వైద్యురాలు ఎండీ అజ్మీనా నిజరిన్‌తో, అర్బన్ హెల్త్ అసిస్టెంట్ వెంకటపతిరాజుతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్వేలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు ఏఎన్ఎం, ఆశ వర్కర్ అడిగి తెలుసుకుంటున్న తీరుపై పరిశీలన చేయాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో తెలంగాణ ఈసీ పార్థసారథి


శ్రీవారి ఆలయంలో పార్థసారథికి స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, ఏఈఓ ఎం.దుర్గారావు చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ మద్దాల శ్రీనివాస్, ప్రొటోకాల్ గుమస్తా అప్పన్న, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు పొగాకు బోర్డు చైర్మన్ రాక

కొయ్యలగూడెం: జిల్లాలోని పొగాకు వేలం కేంద్రాలను వర్జీనియా పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ గురువారం సందర్శిస్తారని కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా ఆయన సమావేశాలు నిర్వహించి ముఖాముఖి చర్చలు జరిపి రైతులు అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాలను పరిశీలిస్తారని, రైతు ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

డాబాపై కాలుజారి.. విద్యుత్ వైర్లకు తగిలి..

పోడూరు: డాబాపైకి ఎక్కి శ్లాబ్‌పై నాచు కారణంగా కాలు జారి సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో ఓ యువకుడు షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమ్ముచిక్కాల పెదపేట ప్రాంతానికి చెందిన ఈతకోట సురేష్ (23) మంగళవారం రాత్రి డాబాపైకి వెళ్లాడు. శ్లాబ్‌పై నాచు ఉండడంతో వర్షం చినుకులకు కాలుజారి ఆ డాబాకు సమీపంలోనే ఉన్న విద్యుత్‌లైన్ వైర్లు అతని కాలికి తగిలాయి. దీంతో షాక్‌కు గురై డాబాపై నుంచి కిందపడిపోయాడు. కిందపడి కొట్టుకుంటున్న సురేష్‌ను గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేష్‌కు ఏడాదిన్నర కిందటే వివాహం జరిగింది. అతని భార్య కీర్తి ప్రస్తుతం గర్భిణి. ఈ దుర్ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై స్థానిక ఎస్సై డి.రామ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్ మృతదేహానికి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

భర్తే కాలయముడై..

- కత్తితో భార్య మెడపై విచక్షణా రహితంగా నరికి హత్య
- రామానుజపురంలో ఘటన.. పోలీసుల అదుపులో భర్త?
- పదేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు.. కోర్టులో విడాకులకు దరఖాస్తు


రామానుజపురంలో రక్తపు మడుగులో ఉన్న సాయిలక్ష్మి మృతదేహం


ఇద్దరు పిల్లలతో సాయి లక్ష్మి (ఫైల్)


భర్త సూర్యచంద్ర

కొయ్యలగూడెం : భర్తే కాలయముడై భార్యను కడతేర్చాడు. కత్తితో విచక్షణా రహితంగా నరకడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సీఐ మధుబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామానుజపురం గ్రామానికి చెందిన రాజనాల సాయి లక్ష్మి(35)కి భర్త సూర్యచంద్రంతో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి విలాష్ సాయి, విశాల్ సాయి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారుగా పది సంవత్సరాల నుంచి వీరు నిత్యం గొడవలు పడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సూర్యచంద్రంపై సాయి లక్ష్మి కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపివేశారు. అనంతరం ఇద్దరూ కోర్టులో విడాకుల కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు కొనసాగుతోంది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. సాయిలక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా.. సూర్యచంద్రం ఆవేశంతో ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని సాయి లక్ష్మి మెడపై విచక్షణారహితంగా నరకడంతో ఆమె రోడ్డుపై పడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భర్తను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా తన కుమార్తెను అల్లుడు సూర్యచంద్రం ఉద్దేశపూర్వకంగానే హత్య చేశాడని, కొంతకాలంగా తన కుమార్తెను ఆడపడుచు, భర్త, అత్తమామలు చిత్రహింసలకు గురిచేస్తున్నారని తల్లి నాగలక్ష్మి ఆరోపించింది. బిడ్డల్ని కూడా అల్లుడు చూసుకునేవాడు కాదని, కుమార్తె తన వద్దకు వచ్చి నిత్యావసర సరుకులు తీసుకువెళుతూ ఉండేదని తల్లి పేర్కొంది. తన చెల్లెలు మృతి వెనుక సూర్యచంద్రం తల్లిదండ్రులు, చెల్లి, బావ ఉన్నారని అన్న మృతురాలి అన్న సుబ్రహ్మణ్యం ఆరోపించాడు. దీనిపై మృతురాలి తల్లి, అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ సురేష్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలికపై అఘాయిత్యం కేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: నూజివీడు ప్రాంతంలో చిన్నారి బాలికపై అఘాయిత్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ చెప్పారు. ఏలూరులో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. నూజివీడు సమీపంలోని ఫ్యాక్టరీకి చేపల దాణా లోడుతో లారీ వచ్చింది. లారీ ఓనర్, డ్రైవర్ పెంటబోయిన రామకృష్ణ తోపాటు నిందితుడు మిరియాల జయరావు (క్లీనర్) చేపలదాణా అన్‌లోడ్ చేసేందుకు వచ్చారు. నూజివీడు మండలం సీతారామపురంలో లారీలో మరో కిరాయికి లోడింగ్ ఆలస్యం అయ్యింది. సుమారు రాత్రి 10గంటల సమయంలో జయరావు తన ఊరు వెళ్ళిపోతానంటూ యజమాని వద్ద రూ.300 తీసుకుని బయలుదేరి వస్తుండగా కొంతదూరంలో ఇల్లు కనిపించింది. అందరూ నిద్రపోతుండటాన్ని గమనించి సెల్‌ఫోన్ చోరీ చేశాడు. అక్కడ తాతయ్య, మామ్మ మధ్యలో నిద్రపోతున్న ఐదేళ్ల బాలికను ఎత్తుకుని ఇంటికి ఎదురుగా ఉండే పామాయిల్ తోటలోకి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి కాళ్లకు ఉన్న వెండి పట్టీలను తీసుకుని, బాలికను అక్కడే వదిలివేసి పరారయ్యాడు. ఈ ఘటనపై చిన్నారి కుటుంబ సభ్యులు 112కు ఫిర్యాదు చేయటంతో రాత్రి 2.30 గంటల సమయంలో ఏలూరు పూర్వ డీఎస్పీ శ్రీనివాసులు దిశ ఎస్సై క్రాంతిప్రియ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ల ఆధారాల కోసం ప్రయత్నించారు. బాలికను వైద్య పరీక్షలకు తరలించారు. నిందితుడి ఆచూకీ కోసం భీమడోలు సీఐ రవికుమార్, నిడమర్రు సీఐ సుభాష్, నూజివీడు రూరల్ సీఐ కే.రామకృష్ణ, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం కుమ్మరికోటకు చెందిన మిరాయాల జయరావు గతంలోనూ అదే గ్రామంలో ఇలాంటి నేరానికి పాల్పడినట్లు పోలీస్ రికార్డుల్లో గుర్తించారు. నిందితుడ్ని ఈనెల 6న హనుమాన్ జంక్షన్‌లో అరెస్ట్ చేసి అతనివద్ద నుంచీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా, బాలికలపై నేరాలకు ప్రత్యేక రిజిస్టర్

ఏలూరు జిల్లాలో మహిళలు, చిన్నారులపై నేరాలు, అఘాయిత్యాలకు పాల్పడితే నేరస్తుల కోసం ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ చెప్పారు.. ఈ రిజిస్టర్‌లో రెండు, మూడు సార్లు నేరాలకు పాల్పడే వ్యక్తుల వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్ అభినందించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు

ద్వారకాతిరుమల: జాజులకుంట పంచాయతీ కార్యాలయంపై వైఎస్సార్ సీపీ జెండాను ఆ పార్టీ కార్యకర్తలే ఎగురవేసి, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఫ్లెక్సీని ధ్వంసం చేశారని ఆరోపిస్తూ పంచాయతీ కార్యదర్శి భీమడోలు సుబ్బారావు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ కార్యకర్త చవల సంజయ్, మరో ఇద్దరు అనుమానితులు అంటూ ఎస్సై జి.సతీష్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు జాజులకుంటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పలు రకాలుగా వేదిస్తున్నారు. ఇదిలా ఉంటే టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంపై టీడీపీ జెండాను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయంపై రాజకీయ పార్టీ జెండాలు పెట్టడం ఏంటని వైఎస్సార్ సీపీ కార్యకర్త చవల సంజయ్ మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి సుబ్బారావును నిలదీశారు. అలాగే ఎంపీడీఓ తిరుపతిరావుకు పలుమార్లు దీనిపై ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ సర్పంచ్ భర్త బత్తుల విజయశేఖర్ తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు టీడీపీ జెండాను తొలగించి, కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఫ్లెక్సీని వారే ధ్వంసం చేసుకుని తమ పార్టీ కార్యకర్తలు సంజయ్, మరికొందరిపై నెట్టివేసినట్టు విజయ్‌శేఖర్ ఆరోపిస్తున్నారు. తమపై అక్రమంగా సంజయ్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.

నీట్ ర్యాంకర్లకు కౌన్సెలింగ్‌పై అవగాహన


సదస్సులో బూరుగుపల్లి రవికుమార్, అతిథులు

ఉండ్రాజవరం: సీనియర్ అధ్యాపక బృందం సారథ్యంలో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ద్వారా తమ విద్యార్థులు నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. ఆ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలోని సూర్యా గార్డెన్స్‌లో నీట్ ర్యాంకర్లకు నీట్–2024 కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ఏటా తమ విద్యాసంస్థ నుంచి 300 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తున్నారన్నారు. ముఖ్యఅతిథి, పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రిన్సిపాల్ ఎంవీ భీమేశ్వర్ తన ప్రసంగంలో విద్యార్థులు తమకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా నీట్ కౌన్సెలింగ్‌లో కళాశాలను ఎలా ఎంపిక చేసుకోవాలో వివరించారు. మరొక అతిథి, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిటైర్డ్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ఆలిండియా కోటా, స్టేట్ కోటా, లోకల్, నాన్ లోకల్ తదితర అంశాలు విద్యార్థులకు వివరించారు. శశి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ, అకడమిక్ డైరెక్టర్లు డాక్టర్ ఎంవీ రావు, చిట్టూరి శేషుబాబు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో ఇష్టపడి చదివితే అద్భుత అవకాశాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఇంజనీరింగ్ ఇష్టపడి చదివితే అద్భుత అవకాశాలు ఉన్నాయని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. శ్రీవాసవిలో ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి వక్తలు మాట్లాడారు. ఇష్టపడి చదవుతూ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఇంజనీరింగ్ సబ్జెక్టులలో పట్టు సాధిస్తే పారిశ్రామిక రంగ అవసరాలకు ఉపయోగపడేలా కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యక్షులు కోట వెంకట రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, కోశాధికారి పేరూరి బాల కాశయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు, చక్కా అప్పారావు, స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ రాంబాబు, విద్యార్థులు హాజరయ్యారు.

'శశి'లో ఇండక్షన్ ప్రోగ్రామ్


ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో కళాశాల యాజమాన్యం

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాలను చేధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. సంస్కారాన్ని పెంపొందించుకుని అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మహ్మద్ ఇస్మాయిల్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

మరో ఇద్దరికి గాయాలు


ప్రమాదస్థలంలో మహిళ మృతదేహం

నరసాపురం : బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. టౌన్ సీఐ బి.యాదగిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం రూరల్ మండలం రుస్తుంబాద మంగళగుంటపాలెంకు చెందిన మేకా మేరీబాయ్ (56) వివరాలు ఇలా ఉన్నాయి. మేరీబాయ్ వరసకు మేనల్లుడయ్యే గోరింకల అలీవర్‌తో కలిసి బైక్‌పై ఎక్కి నరసాపురం పట్టణంలోని ఆసుపత్రికి వచ్చింది. అనంతరం ఇంటికి బయలుదేరారు. మొగల్తూరు రోడ్డులో ఆంజనేయస్వామిగుడి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మేరీబాయ్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, బైక్ నడుపుతున్న అలీవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కాళీపట్నంకు చెందిన పెద్దింట్లు అనే మహిళను కూడా కారు ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. కారు నడుపుతున్న కోళ్ల శ్రీనివాస్ నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ వివరించారు.

సైబర్ నేరగాళ్ల వలలో రైతు

వ్యవసాయం పెట్టుబడి కోసం బ్యాంకు ఖాతాలో దాచిన రూ.38,500 మాయం


కాళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత రైతు బాబ్జి

కాళ్ల: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న ఓ రైతు తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.38,500 సొమ్మును పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. కోమటిగుంట గ్రామానికి చెందిన యలమంచిలి బాబ్జి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఉండి మండలం పెదపుల్లేరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఖాతా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాబ్జి మొబైల్ ఫోన్‌కి ఓటీపీ మెసేజ్‌లు వచ్చాయి. ఓపెన్ చేసి చూస్తుండగా తన బ్యాంక్ ఖాతా నుంచి వరుసగా ఏడు సార్లు రూ.5 వేలు, రూ.3,500 చొప్పున మొత్తం రూ.38,500 విత్‌డ్రా అయినట్లు మెస్సేజ్‌లు వచ్చాయి. బ్యాంకు యాప్‌లో చూడగా వినీష్ కుమార్ అనే వ్యక్తి ఖాతాకు నగదు బదిలీ అయినట్లు గమనించి వెంటనే 1930 నంబర్‌కి ఫోన్ చేసి సైబర్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం బ్యాంకుకు వెళ్లి తన ఖాతాను ఫ్రీజ్ చేయించారు. ఈ నెల రెండో తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ పోలీసుల నుంచి మెస్సేజ్ వచ్చింది. బుధవారం కాళ్ల స్టేషన్‌లో బాబ్జి ఫిర్యాదు చేశారు. పొలం పెట్టుబడి కోసం తన ఖాతాలో దాచుకున్న డబ్బులు దోచుకోవటంపై కన్నీటి పర్యంతం అయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి అధికారులకు అందలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్‌లో అవినీతి అధికారులను అందలం ఎక్కించడం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు సర్కిల్ పరిధిలో జీలుగుమిల్లిలో ఏఈగా పనిచేసిన పులిచర్ల సాంబయ్య, దెందులూరు ఏఈగా పనిచేసిన మల్లుల రమేష్‌బాబు అవినీతికి పాల్పడగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండడ్‌గా పట్టుకున్నారు. అప్పట్లో వీరు సస్పెన్షన్‌కు కూడా గురయ్యారు. వీరిద్దరికీ ఇటీవల బయ్యనగూడెం, విజయరాయిలో ఆపరేషన్ ఏఈలుగా పోస్టింగ్‌లు ఇవ్వడాన్ని సంస్థ ఉద్యోగులు తప్పుపడుతున్నారు. ఈ వ్యవహారంలో రూ.20 లక్షల వరకు చేతులు మారినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

'గూడెం' తహసీల్దార్‌గా సునీల్‌కుమార్


ఎం.సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల తహసీల్దార్‌గా ఎం.సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మురళీకృష్ణ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సునీల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు తహసీల్దార్ కార్యాలయ డీటీ శివశంకర్, సర్వేయర్ రౌతు రామకృష్ణ, సిబ్బంది, రేషన్ డీలర్లు కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఇన్‌ఛార్జ్ ఆర్డీవో బీఎస్ఎస్.రెడ్డిని తహసీల్దార్ సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

రూరల్ ఎస్ఐగా ప్రసాద్


జేఎస్‌వీ.ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జేఎస్‌వీ.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సురేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ప్రసాద్ బదిలీపై రూరల్ స్టేషన్‌కు వచ్చారు.

ఇరగవరం ఎస్ఐగా జానా సతీష్



ఇరగవరం: ఇరగవరం ఎస్ఐగా జానా సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తణుకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసిన ఈయన బదిలీపై ఇరగవరం స్టేషన్‌కు వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరగవరం మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ప్రజలు, సిబ్బంది సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులను ఆదుకోవాలి


చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలో ఇటీవల వచ్చిన వరదలు, అధిక వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయాన్ని అందించి, రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సాగుకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. అతి వర్షాలు, వరదలు కారణంగా పంట నష్టంతో జిల్లాలో వేలాది మంది రైతులు నష్టపోయారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు పైగా కావస్తున్న పంటల బీమా విధానాన్ని ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. కొత్త ప్రభుత్వం తక్షణమే పంటల బీమా పై తమ విధానాన్ని ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

చేనేత వస్త్రాల పంపిణీ


బీజేపీ నాయకులచే చేనేత వస్త్రాలు పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాలు మేరకు పట్టణంలోని ఆప్కో చేనేత వస్త్ర దుకాణంలో బుధవారం బీజేపీ నాయకులు అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్యకర్తలకు పంచారు. వక్తలు మాట్లాడుతూ చేనేత వస్త్రాలు ధరిద్దాం చేనేత కార్మికులకు సహకారాన్ని అందిద్దాం అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కోట రాంబాబు, రామగాని సత్యనారాయణ, మారిశెట్టి వెంకట నరసింహమూర్తి, చిట్యాల రాంబాబు, తుమరాడు చిన్న, ఐయినపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పట్ల తక్షణం స్పందిస్తా

పెంటపాడు: రాజకీయాలకు తావు లేకుండా ప్రజా సమస్యల పట్ల తాను తక్షణం స్పందిస్తానని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. తహసిల్దార్‌ను కలిసి అభినందించిన వారిలో రేషన్ డీలర్ల సంఘ నాయకులు, కమ్యూనిస్టు, రైతు సంఘం, సర్వేయర్ల సిబ్బంది కలిసి తహసీల్దార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వ్యక్తి హల్‌చల్

భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్తంభం ఎక్కడంతో చూస్తున్న వారు హడలిపోయారు. విషయం తెలిసిన వెంటనే పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని అతనికి నచ్చజెప్పి చెప్పి కిందికి దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిండా మునిగిన పంటలు

- ఆశలు వదులుకున్న రైతులు
- తీవ్ర నష్టాన్ని మిగిల్చిన యనమదుర్రు డ్రెయిన్ వరద


ముంపు వీడినా ఇంకా తేరుకోని మీనవిల్లూరులో వరి పొలాలు

పెంటపాడు: మండలంలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. తాజాగా కురిసిన భారీవర్షాలకు చాలాచోట్ల నారుమడులు నీట మునిగాయి. ఇప్పటికీ కొన్నిచోట్ల నీటి ముంపు నుంచి పొలాలు తేరుకోలేదు. ఓ వైపు నారు కుళ్లిపోతుందన్న దిగులు, మరోవైపు నారు ముదిరిపోయి దిగుబడి తగ్గిపోతుందన్న భయం రైతుల్నిపీడిస్తున్నాయి. వర్షాలవల్ల వాగులు, వంకలు పొర్లి ప్రవహించాయి. ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్, వెంకయ్య కాలువలతోపాటు ఆరుదలకోడు, మిడ్‌లెవిల్, లోలెవిల్, అత్తిలి కాలువల నిండా నీరుచేరింది. ఈ సందర్భంగా గూడెం, తణుకు నియోజకవర్గాల్లో డెల్టా ప్రాంతంలో పలు మండలాలలో వరినాట్లు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. వేల ఎకరాలు నీట మునిగినట్లు అంచనాలు వేసారు. ఇంకా నష్టం వివరాలు వెల్లడించలేదు. సుమారు 10 రోజులు పైగా నీటిలోనే నాట్లు ఉండటంతో ముంపు అనంతరం వరి పొలాలు తేరుకొన్నాయి. కాగా జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల టీం సభ్యులు కొన్ని రోజులుగా పలు గ్రామాలు పర్యటించి పంట నష్టం అంచనాలు వేస్తున్నారు. అయితే పాక్షికంగా నాట్లు దెబ్బతిన్న వరి పొలాలు ఎన్యూమరేషన్ పరిగణలోకి తీసుకోరని రైతులు భావిస్తున్నారు. ఎన్యూమరేషన్ కోసం ఎదురుచూడకుండా దెబ్బతిన్న పొలాల్లో తిరిగి నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. కాగా వారికి నారు కొరతగా ఉంది. మళ్లీ నాట్లు వేద్దామంటే మరో నెల సార్వా ఆలస్యం అయ్యేలా ఉంది. ఈ లోగా అయిన కాడికి ఎక్కువ ఖర్చుతో దూర ప్రాంతాల్లో నారు కొనుగోలు చేసుకొని దెబ్బతిన్న పొలాలలో మళ్లీ నాట్లు వేసుకొంటున్నారు. ఈ విషయంలో రైతులు తీవ్ర ప్రయాసలు పడుతున్నారు. ప్రధానంగా కౌలు రైతులకు పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వారి కోసం ప్రత్యేకంగా ఒక ప్రకటన చేయాలని కోరుతున్నారు.


కాశిపాడు వరిపొలంలో అక్కడక్కడా నాట్లు వేసేందుకు పోగులు సిద్ధం చేసుకొన్న దృశ్యం


వరినారు కోసం రైతుల జాగ్రత్తలు

కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి



తుఫాను బాధిత ప్రాంతాల్లో అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కానీ రైతును ఆదుకొనేందుకు ఏం చర్యలు తీసుకోబోతున్నారో ఒక్క ప్రకటన కూడా చేయకపోవడం విచారకరం. గతంలో జగనన్న అధికారంలో ఉండగా తక్షణమే జిల్లా కలెక్టర్ల ద్వారా సాయం అందేది.

– దేవరశెట్టి రాంబాబు, రైతు, కొండేపాడు

తహసీల్దార్‌కు అభినందనలు

తణుకు టౌన్: తణుకు తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన డీవీఎస్ఎస్ అశోక్ వర్మను తణుకు తాలూకా ఏపీఎన్జీవో సంఘం నాయకులు కలసి అభినందనలు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వర్మను కలసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కేఎస్‌వీ నరసరాజు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి వైవీఎస్‌బీ రాయుడు, ఉపాధ్యక్షుడు పీవీ నాగరాజు, ఎస్ వెంకట రమణ, ఆర్ శ్రీనివాసరావు, బీ తుమ్మన్నలతో పాటు వివిధ శాఖలకు సిబ్బంది, గ్రామాలకు చెందిన వీఆర్ఏలు కలసి అభినందనలు తెలిపారు.

పీఎం ఆవాస్ యోజన ఇళ్ల పరిశీలన

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణానికి సంబంధించి విస్సాకోడేరు లేఔట్‌లో నిర్మిస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్లను బుధవారం కేంద్ర ఏజీ ఆడిట్ టీం జిల్లా హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం పనితీరు, ఎల్ల నిర్మాణం వాడుతున్న మెటీరియల్స్, అకౌంట్స్ తదితరు వాటిని పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మాణం పూర్తి ఇళ్ల వివరాలను సేకరించారు. వారి వెంట ఇంచార్జ్ హౌసింగ్ పీడీ పిచ్చయ్య, డి ఈ శివరామరాజు, ఏ ఈ లు సాంబశివరావు, నాగేంద్ర, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు విధిగా పరీక్షలు చేయించుకోవాలి


వెంకట్రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు నెలవారీ పరీక్షలను విధిగా చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ 80, 81లలో తల్లిపాల వారోత్సవాలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ గర్భవతులు తమ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. తద్వారా బిడ్డ బలవర్ధకంగా ఎదుగుతాడన్నారు. దండగర్ర గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎండి.రజినా బేగం, ఆర్.సుబ్బలక్ష్మి, డి.ప్రభారాణి, ఆర్.ప్రవీణ, కే.కనకలత, సీహెచ్‌.శాంతకుమారి, మెడికల్ హెల్త్ అసిస్టెంట్‌వి.బాబ్జీ, ఆశా కార్యకర్త వెంకటలక్ష్మి, వీవీ.భాస్కరరావు, కొమ్ము గూడెం కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.బేబి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రాణి, ఎం.వెంకటరమణ, యు.వెంకటలక్ష్మి, ఇ.మంగతాయారు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకులో టయోటా నూతన షోరూం ప్రారంభం


తణుకులో టయోటా నూతన షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పట్టణంలో నూతనంగా టయోటా కిర్లోస్కర్ మోటారు వాహనాల షోరూమ్‌ను ప్రారంభించినట్లు ఆసంస్థ సౌత్ జోన్ హెడ్ మహారాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు పట్టణంలోని ఉండ్రాజవరం జంక్షన్‌లో ఏర్పాటు నూతన షోరూంను డీటీవో సంజీవ్‌కుమార్ ప్రారంభించారు. ఈషోరూం ఆధీకృత డీలర్ పృధ్వీ టయోటా యొక్క నూతన టీ -స్పర్శ షోరూంను ప్రారంభించింది. ఈ షోరూంలో నూతనంగా టయోటా అర్బన్ క్రూజర్ టైజర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ షోరూంలో టయోటా అన్ని రకాల వాహనాల ప్రదర్శన టెస్ట్ డ్రైవ్ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టయోటా ఆంధ్రప్రదేశ్ హెడ్ నిఖిల్, ఏరియా మేనేజర్ శశికాంత్, పృధ్వీ టయోటా చైర్మన్ మాలెంపాటి రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీ చంద్ర, సీఈవో కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేయాలి

నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

తణుకు అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగ్గ క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం పోలీసు శాఖ అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం తణుకు కోర్టులో పోలీసు అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో కక్షిదారులతో మాట్లాడి ఇరుపక్షాలను రాజీ దిశగా తీసుకువచ్చి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారుల విలువైన సమయంతోపాటు డబ్బు కూడా సద్వినియోపడుతుందని స్పష్టం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, జూనియర్ సివిల్ జడ్జిలు పి.సాయిరామ్, పీవీ రంజిత్‌కుమార్, ఏవీ నాగరాజు, స్పెషల్ కోర్టు న్యాయవాదులు ఎస్.చిరంజీవిరావు, తాడి ఆంజనేయులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హనుమంతరావు, అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగాచార్యులు, రూరల్ సర్కిల్ ఇనస్పెక్టర్ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తుల వాడకంతో దేశాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న కశ్మీర్ లాల్‌జీ

భీమవరం: విదేశీ వస్తువులు విడనాడి స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని పెంచితేనే దేశాభివృద్ధి సాధ్యమనే నినాదాన్ని గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ సంఘటక్ (ఇన్‌ఛార్జ్) కశ్మీర్ లాల్‌జీ అన్నారు. భీమవరం పట్టణంలోని గౌతమి సేవా సమితి భవనంలో బుధవారం జిల్లా కన్వీనర్ వేమిరెడ్డి హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఉద్యోగాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలని, చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని తోటి వారికి ఉపాధి కల్పించే విధంగా ఎదగాలన్నారు. రాష్ట్ర మహిళా సంయోజక్ పావని మాట్లాడుతూ దేశంలో ఉపాధి అవకాశాలు పెరగాలంటే స్వదేశీ ఉత్పత్తుల వాడకం పెరగాలని తద్వారా దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. స్వదేశీ తయారీ సంస్థలను ఆదరించాలని, నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి


తణుకు టౌన్: ముద్దాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అంగన్‌వాడీ సిబ్బంది

తణుకు టౌన్ : తల్లిపాలతో రోగ నిరోధక శక్తి ఇమిడి ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం పైడిపర్రు సెక్టార్‌లో గల ముద్దాపురం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ లక్ష్మి మాట్లాడుతూ శిశువులకు ఆరునెలల వరకు తల్లి పాలు అందించాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను ప్రోత్సాహించవద్దని, అలా ప్రోత్యాహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. తణుకు సాహితీ సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సురక్ష ఆసుపత్రిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బచ్చు లక్ష్మీప్రసన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పునాది తల్లిపాలు అని చెప్పారు. ముర్రుపాలు బిడ్డకు సంజీవనిలా పని చేస్తాయని చెప్పారు. ఈకార్యక్రమంలో సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు, వైద్యులు డాక్టర్ పీ రామలక్ష్మీ, పీ విఠల్ రాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


అత్తిలి: ఆరవల్లిలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: పుట్టిన బిడ్డకు తల్లిపాలను పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యంగా జీవిస్తుందని మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ పి శశిస్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల విశిష్టతను వివరిస్తూ అవగాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపుగా ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఈపాలలో విటమిన్ ఏ అధికంగా ఉండటం వల్ల కంటిచూపు బాగుంటుందన్నారు. కామెర్ల వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. బిడ్డకు ఆరునెలలు పూర్తయ్యేవరకు ఇతర ద్రవాలు ఇవ్వకుండా కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజటర్ మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎన్ కుమారి, ఎస్ విజయ, టి వరలక్ష్మి, సుగుణ, ఆరోగ్యసిబ్బంది విజయలక్ష్మి, వేణుగోపాలస్వామి, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, మాధవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి


బొలిశెట్టి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జెడ్పీ సీఈఓ

తాడేపల్లిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు ఏర్పాటు చేయాలని జెడ్పీ సీఈఓతో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం జెడ్పీ సీఈఓ కె.ఎస్.సుబ్బారావు బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మంచినీటి అవసరాల కోసం అవసరమైతే తాను స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరి సమీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఆక్రమణలు తొలగించాలి


వార్డు సందర్శనలో మునిసిపల్ కమిషనర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పురపాలక సంఘ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వార్డు సందర్శన కార్యక్రమం 30వ వార్డులో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. వివిధ లోతట్టు ప్రాంతాలలో డ్రెయిన్‌లను పరిశీలించారు. శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రెయిన్‌లలో మురుగు నీరు పారుదల సక్రమంగా జరిగే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ఆక్రమణలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా పాడైన కల్వర్టులను పరిశీలించారు. తాగునీరు పరిశుభ్రంగా వస్తుంది, లేనిది ప్రజల వద్ద నుంచి వివరాలు సేకరించారు. కె.ఎన్.రోడ్డులో డ్రెయిన్‌పై చిన్న చిన్న బడ్డీలు ఏర్పాటు చేయరాదని, వాటిని తొలగించాలని సిబ్బందికి సూచనలు చేశారు.

భూమిపై ఎటువంటి హక్కు ఉండదు

తాడేపల్లిగూడెం రూరల్: సాగుదారుకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఏ విధమైన హక్కు ఉండదని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిగూడెం తన కార్యాలయంలో ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. వాస్తవ సాగుదారు పేరునే ఈ-పంటలో నమోదుచేస్తామన్నారు. సాగుదారు వివరాలు, పంట, రకం, విస్తీర్ణం, నీటి పారుదల పద్ధతులు నమోదు చేస్తామన్నారు. సాగుదారు పొలం వద్దకు వచ్చి జియో ఫెన్సింగ్ ద్వారా పంట నమోదు చేయనున్నట్టు తెలిపారు. పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ-పంట నమోదుచేసుకోవాలన్నారు. రాయితీ విత్త నాలు, యంత్ర పరికరాలు, కౌలుదారులకు రుణా లు, వడ్డీ రాయితీలు, పంట నష్ట పరిహారం, పంటల బీమా, ధాన్యం కొనుగోలు కనీస మద్దతు ధర, పంట రుణాలు వంటివి ఈ-పంట ద్వారానే లభిస్తాయన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఆకివీడు: స్థానిక పూల కొట్టులో పని చేస్తున్న మహమ్మద్‌ను నలుగురు వ్యక్తులు ఈ నెల ఆరో తేదీన కాపుకాసి దాడి చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగబాబు చెప్పారు. స్థానిక ముస్లిం వీధిలో నివసిస్తున్న మహమ్మద్ పనులు ముగించుకొని రాత్రి ఇంటికి వస్తుండగా అయ్యప్ప, రఘు మరో ఇద్దరితో కలిసి చేసిన దాడిలో తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం

మండలంలోని చెరుకుమిల్లికి చెందిన తానుపల్లి కృష్ణమూర్తి ఈ నెల రెండో తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి.నాగబాబు బుధవారం చెప్పారు. బంధువుల ఇళ్లలోనూ, చుట్టు పక్కల వెతికినప్పటికీ ఆచూకీ తెలియక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చేనేతలపై పన్నుల భారం తగ్గించాలి


వేల్పూరులో చేనేత పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామ సర్పంచ్ కృష్ణవేణి

తణుకు టౌన్: చేనేత వృత్తిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నుల భారాలను తొలగించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణ వేణి ముఖ్యఅతిథిగా హాజరై చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చేనేత వృత్తిని దెబ్బతీసే విధానాలు అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా చేనేత కార్మికులు పోరాడి సాధించుకున్న చేనేత బోర్డును రద్దు చేశారని, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, హెల్త్ ఇన్సూరెన్స్, చేనేత కార్మికులు హౌస్ కం వర్క్ షెడ్ల ఏర్పాటు వంటి వాటిని రద్దు చేశారని చెప్పారు. వీటితో పాటు చేనేత వస్త్రాలపై 5 శాతం, చేనేత వస్త్రాలకు ఉపయోగించే రంగులు, రసాయాలపై 5 నుంచి 12 శాతం వరకూ జీఎస్టీ విధించడం సరికాదన్నారు. చేనేత వస్త్రాలపై పన్నులను తొలగించి వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, పోసియ్య, నాగేంద్ర, నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. చేనేత వస్త్రాలు ధరించి ఆరంగాన్ని ప్రోత్సాహించాలని రాష్ట్ర చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి కోరారు. బుధవారం తణుకులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీనియర్ చేనేత నాయకులను సత్కరించారు. ఈకార్యక్రమంలో బీరకాయ ప్రసాద్, వేల్పూరు గ్రామ సర్పంచ్ వి కృష్ణవేణి, గుబ్బల శ్రీనివాసు, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, ఆకుమర్తి శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.